క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

కంటోన్మెంట్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అల్వాల్ సబ్ స్టేషన్ పరిధిలోని దినక్‌నగర్, మధుర ఎన్‌క్లేవ్ ప్రాంతాలు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు మచ్చబొల్లారం సబ్ స్టేషన్ పరిధిలోని మధుర ఎన్‌క్లేవ్, అల్వాల్ పరిధిలోని జానకి నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎంఈడీ, ఎంపీఈడీ జాబితా విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూతో పాటు ఇతర వర్సిటీల పరిధిలోని కాలేజీల్లో ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లో సీటు సాధించిన విద్యార్థుల చివరి జాబితాను విడుదల చేసినట్లు సీపీజీఈటీ-2022 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. అడ్మిట్‌కార్డుతో పాటు ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లను ఈ నెల 25 వరకు ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలన్నారు. ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సులలోని మొత్తం 891 సీట్లలో 550 సీట్లు భర్తీ కాగా ఎంఈడీలో 300 సీట్లు మిగిలినట్లు కన్వీనర్ పేర్కొన్నారు.

కంటి వెలుగు కేంద్రాల సేవలు షురూ

సికింద్రాబాద్: జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోన్ పరిధిలోని అన్ని కంటి వెలుగు కేంద్రాల్లో వైద్య సేవలు సోమవారం నుంచి అందుబాటులోకి వస్తాయని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ బి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జోన్ పరిధిలోని సికింద్రాబాద్, బేగంపేట్, ముషీరాబాద్, అంబర్‌పేట్, మల్కాజిగిరి సర్కిళ్ల పరిధిలో 38 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ బృందాలకు, పరీక్షల కోసం వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన వసతులు ఏర్పాటు చేశారన్నారు.

ముగిసిన వర్క్‌షాప్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ విభాగంలో మూడ్రోజుల పాటు జరిగిన డిగ్రీ అధ్యాపకుల వర్క్‌షాప్ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా వీసీ ప్రొ.రవీందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఉపన్యసించారు. అనంతరం వర్క్‌షాప్‌లో పాల్గొన్న డిగ్రీ కాలేజీల పొలిటికల్ సైన్స్ అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు రూపవత్ చంద్రునాయక్, చెన్న బసవయ్య, శ్రీలత, సతీష్‌చంద్ర పాల్గొన్నారు.

శ్రీనివాస సమాజసేవా ట్రస్ట్ చేయూత

సనత్‌నగర్: సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్డులోని బట్టల గోదాములో జరిగిన అగ్నిప్రమాద బాధితుల కుటుంబాలకు శ్రీనివాస సమాజ సేవ చారిటబుల్ ట్రస్ట్ చేయూతనందించింది. అగ్నిప్రమాద బాధితులతో పాటు సహాయక చర్యల్లో పాల్గొన్న పోలీసులు, జీహెచ్‌ఎంసీ , ఇతర విభాగాల సిబ్బంది దాదాపు 500 మందికి మధ్యాహ్న భోజనాన్ని అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అభినందించారు. కార్యక్రమంలో ట్రస్టీ పార్థసారధి, విఠల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అరవింద్, ఆంజనేయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

అడ్డగుట్ట: నిరుపేదలు అత్యధికంగా నివసించే ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడంతో వారికి ఎంతో మేలు చేకూరుతుందని మాజీ మేయర్ బండకార్తీక రెడ్డి అన్నారు. అడ్డగుట్టలోని అంజయ్య విగ్రహం బీజేపీ మెడికల్ సెల్ సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. అనంతరం ఆమె ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మద్దెల శ్యామ్‌సుందర్, హంసరాజు, సాయిబాబా, నందు, వీరన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల అరెస్టుతో కిక్కిరిసిన ఠాణా



ఎస్‌ఆర్‌నగర్ స్టేషన్‌లో ఉపాధ్యాయులు

అమీర్‌పేట: జీవో నెం.317ను సవరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు ఆదివారం ప్రగతి భవన్ ముట్టడికి రావడంతో సుమారు 60 మందిని పోలీసులు ఎస్‌ఆర్‌నగర్ స్టేషన్‌కు తరలించారు. దీంతో స్టేషన్ అంతా ఉపాధ్యాయులతో నిండిపోయింది. సాయంత్రం అందరిని ఒకేసారి విడిచి పెడతామని చెప్పి ఒక్కొక్కరివి ఫొటోలు తీయడంపై ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము దొంగలు, నేరస్తులమా అంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. న్యాయమైన డిమాండ్ కోసం శాంతియుతంగా నిరసన చేపడితే అక్రమంగా అరెస్టులు చేయడమే కాకుండ గదిలోకి తీసుకువెళ్లి ఫొటోలు తీయడం పద్ధతి కాదన్నారు.

నాలుగు నెలలన్నారు.. రెండేళ్లైంది!



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి

- నిర్మాణం పూర్తయినా అందుబాటులోకి రాని ఫుట్‌ఓవర్ బ్రిడ్జి
- తార్నాకలో తప్పని ట్రాఫిక్ తిప్పలు
- అందుబాటులోకి తేవాలంటున్న ప్రజలు
- విస్మరిస్తున్న అధికారులు

లాలాపేట: తార్నాక సెయింట్ ఆన్స్ స్కూల్ సమీపంలో చేపట్టిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. తార్నాక సెయింట్ ఆన్స్ స్కూల్‌తో పాటు రోడ్డుకు రెండు వైపులా పలు పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. దీంతో నిత్యం ఈ మార్గంలో వేలాది మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ జాంతో భారీగా వాహనాలు స్తంభించిపోతాయి. అదే సమయంలో కార్యాలయాలకు వెళ్లే వారు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని 2020లో రూ 2.6 కోట్ల వ్యయంతో ఈ ప్రాంతంలో ఫుట్‌ఓర్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

22 మీటర్ల పొడవు..

బ్రిడ్జి పనుల ప్రారంభోత్స సమయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాలుగు నెలల్లో బ్రిడ్జి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని ప్రగల్భాలు పలికారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హామీలతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ కష్టాలు తీరుతాయని తార్నాక వాసులు భావించారు. దాదాపుగా రెండేళ్లు గడుస్తున్నా నేటికీ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి రాకపోవడంతో వాహనదారులు, బాటసారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం అయిందంటే చాలు చక్రబంధంలో చిక్కుకుపోవడం ఖాయమంటున్నారు వాహనదారులు.



సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద నిత్యం ట్రాఫిక్ ఇలా (ఫైల్)

22 మీటర్ల పొడవు, 11 మీటర్ల ఎత్తుతో రెండు వైపులా మెట్ల దారితో పాటు అన్ని హంగులతో లిఫ్టులను సైతం ఏర్పాటు చేశారు.

ప్రారంభోత్సవంలో కాలయాపన

దాదాపు రెండేళ్ల క్రితం విలువైన ప్రజాధనం వెచ్చించి ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసినా దాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు కాలయాపన చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి విషయమై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకురావాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బోర్డు మాజీ సభ్యులు

కంటోన్మెంట్: బోర్డు సభ్యులు రామకృష్ణ అబద్దాలతో మరోసారి కంటోన్మెంట్ ప్రజలను మోసం చేస్తున్నారని మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి (జేఎమ్మార్) ఆరోపించారు. ఆదివారం ఆయన మాజీ సభ్యులు పాండుయాదవ్, లోకనాథం, ప్రభాకర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఢిల్లీకి వెళ్లి వచ్చిన రామకృష్ణ త్వరలో రూ.25 కోట్ల సర్వీసు చార్జీలు విడుదలవుతాయని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఇందులో రూ.10 కోట్లు వచ్చేశాంటూ చెప్పడం మరీ విడ్డూరంగా ఉందన్నారు. రూ.750 కోట్లు దాటిన సర్వీసు చార్జీల బకాయిల్లో కనీసం రూ.100 కోట్లు ఇప్పిస్తామని బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ప్రకటించాడన్నారు. అయితే ఇప్పుడు రూ.25 కోట్లు వచ్చాయంటూ చెబుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విషయానికి వస్తే రూ.80 కోట్ల టీపీటీ బకాయిల్లో సగానికిపైగా విడుదల చేశామన్నారు. కంటోన్మెంట్‌ను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడాన్ని స్థానికులు స్వాగతిస్తున్నారని బోర్డు సభ్యులు వెల్లడించారు. రామకృష్ణ తన స్వార్థం కోసం ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం తగదన్నారు.జీహెచ్‌ఎంసీలో విలీనంతో స్థానికులకు మరింత మెరుగైన సేవలు అందుతాయన్నారు.

పెండింగ్ పనుల పూర్తికి హామీ..

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని తాము సీఈఓ మధుకర్ నాయక్‌ను కోరడంతో క్షేత్రస్థాయిలో పర్యటించి తగిన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఒకటో వార్డు పరిధిలోని ధోబీఘాట్, పెన్షన్‌లైన్‌లో కమ్యూనిటీ హాల్, చింతల్ బస్తీ కమ్యూనిటీ నిర్మాణాలను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రామన్నకుంటలోకి వర్షపు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మంత్రి తలసానికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

సనత్‌నగర్: దివ్యాంగుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసంలో పలువురు దివ్యాంగులు ఆదివారం మంత్రిని కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలతున్న విషయాన్ని వివరించారు. గతంలో దివ్యాంగుల పింఛన్ రూ.500 ఉండేదని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత రూ.1500, ఆ తర్వాత రూ.3,016లకు పెంచారన్నారు. దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా జరపడమే కాకుండా వివిధ విభాగాల్లో క్రీడా పోటీలను నిర్వహించిన విషయాన్ని కూడా గుర్తుచేశారు. దివ్యాంగులకు ఏ సమస్య ఉన్నా అండగా ఉంటామని ఈ సందర్భంగా మంత్రి భరోసా ఇచ్చారు. తమకు త్రిచక్ర వాహనాలు కావాలని కోరగా, స్పందించిన మంత్రి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి లేఖను పంపారు. మంత్రిని కలిసిన వారిలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, సంఘం సభ్యులు సాయిలుగౌడ్, కార్తీక్, పద్మ, సుశీల, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

దళిత క్రిస్టియన్, ముస్లిం, ఆదివాసీల పట్ల కేంద్రం వివక్ష

ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్



మాట్లాడుతున్న ప్రొ. గాలి వినోద్‌కుమార్

లాలాపేట: దళిత క్రిస్టియన్, ముస్లిం, ఆదివాసీల పట్ల కేంద్రం వివక్ష చూపుతోందని దక్షిణ భారత సమితి కన్వీనర్ ప్రొ. గాలి వినోద్‌కుమార్ ఆరోపించారు.ఆదివారం తార్నాకలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రైస్తవ మతం మార్చుకున్న ఓబీసీలు, గిరిజనులకు రిజర్వేషన్లు కల్పిస్తున్న కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు మతం మార్చుకున్న దళితులు, ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించకుండా వివక్షతను ప్రదర్శిస్తుందన్నారు. భారత రాజ్యాంగం 25వ అధికరణ ప్రకారం మత స్వేచ్ఛ కల్పించిందని దీని ప్రకారం ఎవరైనా ఏ మతమైనా తీసుకోవచ్చు.. ఏ దేవున్నైనా ఆరాధించుకోవచ్చని చెప్పందనారు. కానీ అందుకు విరుద్ధంగా దళితులు హిందూ మతం మారితే రిజర్వేషన్లు వర్తించవని చెప్పడం రాజ్యాంగ విరుద్ధమని అది ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని పేర్కొన్నారు. దీనికి అడ్డుగా ఉన్న రాష్ట్రపతి ఆర్డినెన్స్ పేజి నెంబర్-3 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ కులాల హోదా కల్పించాలని డిమాండ్‌చేస్తూ నేడు (ఈ నెల 23న) వరంగల్‌లోని సెంటినరీ బాప్టిస్టు చర్చి క్రిస్టియన్ కాలనీలో జరిగే ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలన్నారు.


'కాంగ్రెస్‌కు పూర్వవైభవం ఖాయం'



రేవంత్‌రెడ్డిని కలిసిన నాయకులు


సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం రానుందని, నూతనోత్తేజంతో యువత ముందుడుగు వేసి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు సైనికుల్లా పనిచేయాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సనత్‌నగర్‌కు చెందిన సీనియర్ నేత ఎలీషా రాపోలు ఆధ్వర్యంలో ఆదివారం పలువురు నేతలు రేవంత్‌రెడ్డిని కలిశారు. త్వరలో తెలంగాణ వ్యాప్తంగా హాథ్ సే హాథ్ యాత్ర చేపట్టనున్న రేవంత్‌రెడ్డికి వారు శుభాకాంక్షలు తెలిపారు. ఏ పార్టీకైనా కార్యకర్తలే బలమని, నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారంలో భాగస్వాములుగా నిలిచి వారి విశ్వాసాన్ని చూరగొనాలని రేవంత్‌రెడ్డి సూచించారు.

ఆర్కెస్ట్రా.. అదిరేలా



సనత్‌నగర్: బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన సింఫనీ ఆర్కెస్ట్రా ఆఫ్ ఇండియా అలరించింది. 45 మంది సభ్యులతో కూడిన దేశంలోని ఏకైక ప్రొఫెషనల్ సింఫనీ ఆర్కెస్ట్రా హైదరాబాద్‌లో మొట్టమొదటిసారిగా హెచ్‌పీఎస్ శతాబ్ది ఉత్సవాల్లో ప్రదర్శన ఇచ్చారు. హెచ్‌పీఎస్ సొసైటీ అధ్యక్షుడు గుస్తీనోరియా, ఉపాధ్యక్షుడు ఫయాజ్‌ఖాన్, సెక్రటరీ అండ్ ట్రెజరర్ చంద్రశేఖర్‌రెడ్డి, బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ రఘురాంరెడ్డి, వేణు వినోద్, అప్పెందర్‌బాబు, మర్రి ఆదిత్యరెడ్డి, ఎంసీ సభ్యులు సోమనాథ్, షాజ్ మహమూద్, వెంకట్ జలగం పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



శ్రీనివాస్‌కు జ్ఞాపిక అందజేస్తున్న యాజమాన్యం

కంటోన్మెంట్: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని రిటైర్డ్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (సీసీఎఫ్), ఐఎఫ్‌ఎస్ అధికారి శ్రీనివాస్ అన్నారు. కంటోన్మెంట్ ఆరో వార్డు రాయల్ ఎన్‌క్లేవ్‌లోని ఓసీమమ్ పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పర్యావరణ, అటవీ సంపద సంరక్షణ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రముఖ మెజీషియన్ సామల వేణుతో కలిసి వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో చైర్మన్ సీఎం ప్రకాశ్ రావు, అకాడమిక్ డైరెక్టర్ పార్థసారథి, ప్రధానోపాధ్యాయురాలు శైలజ పాల్గొన్నారు.

అవార్డు అందజేత

అడ్డగుట్ట: మాదిగ ఉపకులాల మేధావుల ఫోరం సంఘం ఆధ్వర్యంలో అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన సామాజిక సేవకులు విక్కుర్తి పోచయ్యకు అవార్డును అందజేశారు. సమాజంలో బాధ్యతాయుతంగా సామాజిక సేవలు అందిస్తూ, ప్రజల మన్ననలను పొందుతున్న సంఘం సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే రిటైర్డ్ ఉద్యోగి విక్కుర్తి పోచయ్య, వెంకటేష్‌ను మాదిగ, మాదిగ ఉపకులాల మేధావుల ఫోరం అధ్యక్షులు చీమ శ్రీనివాస్ శాలువాలతో సత్కరించి అవార్డును అందజేశారు.

ఆటోను ఢీకొట్టిన బస్సు

నలుగురికి గాయాలు

రాంగోపాల్‌పేట్: ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఆటో డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలైన ఘటన మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మల్లాపూర్‌లో నివసించే ఆటో డ్రైవర్ నగేష్ ఆదివారం సాయంత్రం హైటెక్ సిటీ నుంచి ఆటోలో ముగ్గురు ప్రయాణికులను తీసుకుని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వస్తున్నాడు. ప్యాట్నీ సెంటర్ ప్రాంతంలోని పరేడ్ గ్రౌండ్ మెట్రో స్టేషన్ ప్రాంతంలోని మూలమలుపు వద్ద మూల మలుపు తిరుగుతున్న హయత్‌నగర్ డిపోకు చెందిన బస్సు ఆటోను ఢీకొట్టడంతో అందులో ఉన్న కన్నా, సత్య, కృష్ణ తీవ్రంగా గాయపడగా డ్రైవర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు పాటించని రెస్టారెంట్‌పై కేసు

అమీర్‌పేట: నిబంధనలు పాటించకుండా బార్ అండ్ రెస్టారెంట్ నడుపుతున్న నిర్వాహకులపై ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఆర్‌నగర్ చౌరస్తాలోని హంటర్ బార్ రెస్టారెంట్‌లో పెద్ద శబ్దాలతోతో, లైట్లు, సంగీతాన్ని ప్లే చేస్తున్నారు.అంతే కాక ఎలాంటి అనుమతి లేకుండగా రెస్టారెంట్‌లో పబ్ వాతావరణాన్ని తలపించేలా ఏర్పాట్లు చేసినట్లు గుర్తించి నిర్వాహకుడు హనుమంతు కృష్ణారావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రదీప్ తెలిపారు.

కుక్క మృతికి కారణమైన వ్యక్తిపై..

అమీర్‌పేట: నిర్లక్ష్యంగా కారు నడపడంతో పాటు కుక్కను ఢీకొట్టి దాని మృతికి కారణమైన వ్యక్తిపై ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. కల్యాణ్‌నగర్ వెంచర్ త్రీలోని మహాశక్తి మ్యాన్షన్ అపార్ట్‌మెంట్ ఎదుట ఉన్న వీధి కుక్కను శనివారం బెలెనో కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై పీసీఏ (ప్రివెన్షన్ ఆఫ్ క్రుయాల్టి టు యానిమల్) అధికారి అదులాపురం గౌతం ఆదివారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు. కారు నడిపిన వ్యక్తి స్థానికంగానే ఉండొచ్చని, సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

అమీర్‌పేట: అధిక మోతాదులో మందులు వేసుకుని చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం.. సనత్‌నగర్ శ్యామలకుంట పార్కు సమీపంలో ఉంటున్న సాయితేజ (25) పుట్టుకతోనే మానసిక సమస్యతో బాధపడుతున్నాడు. కూకట్‌పల్లిలోని రెమెడీ ఆసుపత్రి వైద్యుల సూచనల మేరకు నెల రోజులకు సరిపడ మందులు తెచ్చి ఇంట్లో పెట్టారు.ఈ నెల 18న మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సాయితేజ మందులన్నీ వేసుకున్నాడు. రాత్రి భోజనం తర్వాత నిద్రపోయిన సాయితేజ ఉదయం ఎంతకీ లేవకపోవడంతో గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావి ఆర్యసమాజం మహిళా సంఘం రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఆదివారం సంఘం ప్రతినిధులు అనపూర్యాదేవి, తారాబాయి, రామలక్ష్మి తదితరులు ఆవిష్కరించారు.

యానాదులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సికింద్రాబాద్: యానాదులకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మెట్టుగూడలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఆదివారం అధ్యక్షుడు సీహెచ్ రామచందర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఇండ్ల సాంబశివరావు ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర యానాదుల గిరిజన సంఘం సదస్సులో ఐఏఎస్ అధికారి శ్రీధర్, సంఘం జాతీయ అధ్యక్షుడు రమణ, చైర్మన్ ఇండ్ల ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. యానాదుల గిరిజనులు తక్కువ సంఖ్యలో ఉన్న కారణంతో ప్రభుత్వం విద్య, ఉద్యోగనియమకాలు, నివాసాల విషయంలో ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యానాదుల కుల సర్టిఫికెట్లను జారీ చేయడంతో తహసీల్దార్ కార్యాలయ అధికారులు ముందుకు రాకపోతుండడంతో పిల్లలకు రిజర్వేషన్లు, ఉపకార వేతనాలు అందడం లేదన్నారు. సాధారణ గిరిజనులకు లభిస్తున్న రిజర్వేషన్లు యానాదులకు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని విన్నవించారు. ఈ సందర్భంగా యానాదుల మహిళలు ప్రదర్శించిన తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల ప్రదర్శనలు, బతుకమ్మ ఆటలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

నూతన కార్యవర్గం ఎన్నిక



గంగపుత్రసంఘం నూతన కార్యవర్గ సభ్యులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గం వారాసీగూడ, నామాలగుండు గంగపుత్ర సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరిగాయి. నామాలగుండులోని ఆర్‌కేఎం హాల్లో సంఘం నాయకులు సత్యనారాయణ, పంపరి యాదగిరి నేతృత్వంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు చంద్రగిరి ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి మూట గణేష్, ఉపాధ్యక్షుడు నాగరపు శ్యాం, సహాయ కార్యదర్శి గుడిపెల్లి రజనీకాంత్, నిర్వాహక కార్యదర్శులుగా పంపరి నాగరాజు, గిరిధర్ రావు, కోశాధికారిగా మనోజ్‌కుమార్, ఆఫీస్‌బేరర్లుగా యాదగిరి, నవీన్‌కుమార్, ఆంజనేయులు, శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

గోవా తరహా జీహెచ్‌ఎంసీని అభివృద్ధి పరుస్తాం



ప్లాంట్‌ను పరిశీలిస్తున్న శ్రీలత శోభన్‌రెడ్డి, కార్పొరేటర్లు

లాలాపేట: గోవా తరహా జీహెచ్‌ఎంసీని అభివృద్ధి పరుస్తామని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి పేర్కొన్నారు. ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి ఆదివారం గోవాలోని సాలిడ్ వేస్ట్ మెనేజ్‌మెంట్ ప్లాంట్‌లను సందర్శించారు. చెత్తను ప్రాసెస్ చేసే ప్రక్రియపై అక్కడి అధికారులతో అడిగి తెలుసుకున్నారు. గోవాలో మూడ్రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో పబ్లిక్ సర్వీస్ సౌకర్యాలు, మున్సిపల్ కార్పొరేషన్ చట్టం, న్యాయపరమైన అంశాలు, సాలిడ్ వేస్ట్ మెనేజ్‌మెంట్ తదితర అంశాలపై చర్చించామన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో జీహెచ్‌ఎంసీలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.డిప్యూటీ మేయర్ వెంట కార్పొరేటర్లు మాధవరం రోజాదేవి, దేవదీప్తి ఉన్నారు.

యాదవ హాస్టల్ భవన నిర్మాణానికి రూ. లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న మోహన్‌యాదవ్

అమీర్‌పేట: నగరంలో నూతనంగా నిర్మిస్తున్న యాదవ హాస్టల్ భవన నిర్మాణం కోసం అమీర్‌పేటకు చెందిన వ్యాపార వేత్త శెట్టి వంశీ మోహన్‌యాదవ్ విరాళం అందజేశారు.యాదవ సంఘం రాష్ట్ర సెక్రటరీ లక్ష్మణ్‌యాదవ్, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్, చలకాని వెంకట్‌యాదవ్‌ల సమక్షంలో ఆదివారం రూ.లక్ష చెక్కును అందజేశారు.సామాజిక సేవా కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నానని ఈ సందర్భంగా మోహన్‌యాదవ్ తెలిపారు.

రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్‌ను విభజించండి



చినేని వెంకట్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్‌ను విభజించాలని తెలంగాణ మాల ఫెడరేషన్ అధ్యక్షులు చినేని వెంకట్ సీఎం కోరారు. ఆదివారం ఆయన ఓయూలో మాట్లాడుతూ.. ఎస్సీ కార్పొరేషన్‌కు మూడుసార్లు మాదిగలను చైర్మన్లుగా నియమించడంతో ఆ సామాజిక వర్గానికి చెందిన వారికి రుణాలు, దళితబంధు, ఇతర పథకాలు అధికంగా పొందారని ఈ విషయమై సీఎం కేసీఆర్ క్షుణ్ణంగా అధ్యాయనం చేయాలని సూచించారు. ఎస్సీ కార్పొరేషన్‌లో మాల, మాదిగ, ఇతర ఉపకులాల వారు లబ్ధి పొందాలంటే ఏపీ తరహా మాల, మాదిగ, ఇతర ఉపకులాల కార్పొరేషన్లను ఏర్పాటు చేసి ఎస్సీలలోని అన్ని కులాల వారు అభివృద్ధి చెందేల ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఫిబ్రవరి 2న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాల కార్పొషన్ ఏర్పాటు కోసం సభను నిర్వహించనున్నట్లు వెంకట్ పేర్కొన్నారు.

గ్రంథావిష్కరణ



గ్రంథావిష్కరణలో పాల్గొన్న కసిరెడ్డి వెంకట్ రెడ్డి, బీఎస్ ప్రసాద్, జూలూరి గౌరీశంకర్

బన్సీలాల్‌పేట్: తెలంగాణ పునరుజ్జీవన దశలో మన చరిత్రను తెలుసుకోవాలని తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు జూలూరి గౌరీ శంకర్ అన్నారు. పద్మారావునగర్ శివానంద ఆశ్రమంలో డాక్టర్ సరోజన బండ రాసిన ఆత్మకథ సరోజం గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జూలూరి గౌరీ శంకర్ మాట్లాడారు. తెలంగాణలో ఆత్మకథలు రాసిన రచయిత్రులు చాలా తక్కువని ఆత్మకథల్లో ఎంతో సామాజిక చరిత్ర రికార్డు అవుతుందన్నారు. విశ్వసనీయత, నిజాయితీ ఉన్నప్పుడే అది చారిత్రక ఆత్మకథగా మిగులుతుందన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారిణి ఎం. ఛాయారతన్ మాట్లాడుతూ.. సరోజం లోని కొన్ని భాగాలను పాఠ్యపుస్తకాల్లో చేర్చితే ఇప్పటి తరాలు గత చరిత్రను జీవన విలువలను నేర్చుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అడ్వకేట్ జనరల్ బండ శివానంద ప్రసాద్, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షులు డాక్టర్ కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ బొడ్డుప్రభాకర్, న్యూరోఫిజీషియన్ డాక్టర్ జి. శ్రీధర్, ప్రముఖ విమర్శకులు డాక్టర్ దామెర రాములు, కేఎల్ సూర్య, రమ, మహేశ్వర శర్మ, లక్ష్మయ్య పాల్గొన్నారు.